దొంగలు పటాపంచలయ్యారు.

ఇంతలో కృత్తికయ్యకు మూడువందల మూటమాట జ్ఞాపకంవచ్చి వెనుకకు రావడం తటస్థించింది. అతగాని ఆవూ, దూడ తిరిగి ఆతగాడికి దొరికాయి.

ఇదంతా ఏమిటనుకున్నారు పాఠకులు ! గోవు పేరంటాలి మాయ. మాయ అని ఎందుకు అంటూ ఉన్నానూ యంటే, తన ఆవును మళ్ళీ కృత్తికయ్యగాని, కృత్తికయ్య భార్యగాని పాలు పితుకుతూయున్నప్పుడల్లా, కుసింత కడవెట్టినా కొండంత గుండిగెట్టినా, అంతా నురుగే ! నురుగులో ఆవూ కనిపించేదికాదు, దూడా కనిపించేదికాదు. పితికే కృత్తికయ్యా కనిపించేవాడు కాడు. కృత్తికయ్య పాలుపితకడం చూస్తూ విస్తుపోయే మత్త కాసినీ కనిపించేదికాదు. నురుగు వొత్తిగిస్తే పాలసముద్రం, పాలసముద్రంమీది శేషశాయీ కనిపించేవారట !

మాయగాక మరేమిటది ? వింతగాక మరేమిటది ?

....

చీమల త్యాగం

అడిగితేనేగాని ముష్టి పెట్టనిజాతి మనిషి జాతి. అపేక్షిస్తేనేగాని సాయపడని సంఘం మానవసంఘం. పిపీలికాది బ్రహ్మపర్యంతంగల యావత్తు తతిమ్మా ప్రాణికోటి ప్రకృతిసిద్ధంగా ప్రపంచానికి తోడ్పడతాయి. చూడండి ! బ్రహ్మ, మనం కోరకుండానే మనల్ని సృష్టించాడు; ఈ మనల్నే కాకుండా, సమస్త చరాచర

ప్రపంచాన్నీ సృష్టించాడు. చెట్లను చూడండి: మనం అడక్కుండానే ఫలములను రాలుస్తాయి. పువ్వులు పడేస్తాయి. నదులను చూడండి! నావలను తర్లించుకుంటూ పోతాయి తమంతటతామే. వాలునే వదిలేస్తే, ఇఖ మఱి పక్షులను గురించి యోజిస్తుమా- కోరకుండానే కోయిలకూస్తుంది. ఎత్తుగా ఎగురుతూ భరద్వాజ పక్షి పాడుతుంది. మరిగుర్రాలు, ఏనుగులు, లొట్టిపిట్టలు యన్నీ మనం యనుకోకుండానే ఎక్కడలేని సాయం చేస్తూయుంటాయి యీ లోకానికి. ఒక్కమనిషే మరోమనిషికి సాహాయ్యపడడం అనేది, ఎదరవాడు కోరితేనే! ఎదరవాడు యడిగితేనే! ఎందుకూ! అల్పాత్యల్పమైన ఎఱ్ఱచీమలు గావించిన యీ కథ లోని విచిత్రం చదివేరా, లోకంలో మానవేతరమైన ప్రతీప్రాణి స్వతస్సిద్ధంగా ప్రపంచోపకారి యని పాఠకులకు బోధపడి తీరుతుంది.

కథలో కనికట్టులేదు, మాయలేదు—డోలు వాయించడమంటూ ఉండదు. మంత్రించడం జరుగదు. ఈలవేయడం అంటూ కానము—ముంగిసపాము రావు. మామిడిచెట్టు యమాంతంగా దుప్పటిక్రింద మొలవదు. గోచిలోంచి రూపాయ ఊడి పడదు—చూచువారి తప్పెటలుండవు, చూడని వారి తహతహ లగపడవు—అంతా ఋజువు, రూపం, ప్రత్యక్షం, నగ్నసత్యం—— తెలిసినవారికి తేడాలేంది. తెలియనివారికి గోడాగొందీ!

"కాందిశీకులు" "కాందిశీకులు" అనే పేరు ఇప్పుడు పత్రికల్లో వరిపాటిగా పడుతూయున్నాము చూడండి, వాళ్ళు ఒక దేశస్థులుకారు. పడమటి పాంచాలంనుంచి వలసవచ్చిన కాందిశీకులున్నారు. అక్కాశ్మీరదేశాన్నుంచి పిక్కబలం కొద్దీ,

వచ్చిన కాందిశీకులున్నారు. తూర్పువంగనుంచి వైతొలగివచ్చిన కాందిశీకులున్నారు. హైదరాబాదు సంస్థానంనుంచి హైసరబజ్జా యంటూ హడావిడిపడి హడలెత్తి "ఆలించండోయి!" "పాలించండోయి" అంటూ పలాయనులై వచ్చిన కాందిశీకులున్నారు. వీరినందఱను ఒక చోటికి చేరిస్తే "కాందిశీకుస్థాన్" యనే క్రొత్త ప్రదేశం భారతదేశంలో ఏర్పాటు కాగలదు నిజంగా !

ఒక్క నూతన విషమపరిస్థితిలో వెడలివచ్చిన వీరివందరినీ గౌరవించి, వారికి భారత ఐక్యరాజ్యంలో సగంరాజ్యం ఇచ్చివేస్తున్నా, వీరంతా ఒక నూతనయుగానికి కర్తలై, నూతన చైతన్యం కాపరుస్తూ, కులం యని, కట్టుబాటు యని, కోశం యని, కొలత యని, ఏమీలేకుండా సంపూర్ణ స్వేచ్ఛతోను, వినూత్న సంఘబలంతోనూ, విరాజిల్లగలరని నా నమ్మకం,— ఏమా అంటే—వారు, వారి వారి యసలు అస్తులు పోగొట్టుకొన్నారు; వారి వారి ఆదిమోద్యాలకు ఉన్న ఉద్యోగాలకు నీళ్ళు వదలుకొన్నారు. కొందఱు కొందఱు, పిల్లాతల్లీ ఎడమై, భార్యాభర్తా విడివడి, తండ్రీకొడుకులూ ఒకరినొకరు కానక,—ఉన్నారో పోయారో అన్న ఉదంతం కూడా నెరక తిరుగుతూయున్నవారు కలరుకూడాను, వింటే గుండెకు జాలివేస్తుంది. కంటే కళ్ళమ్మట నీళ్ళు కారుతాయి !

"శిబిరాలు" "కాందిశీకుల శిబిరాలు" అంటూ ప్రభుత్వం వారు అక్కడక్కడ నెలకొల్పారు యనుకోండి ! అని ఏపూటలకి ? అక్కడ సదుపాయం కంచె మూలో ఏపంచో ఒక ఖాళీగాయున్న యరుగుమీద పరుండి, ఏవేళో ఒకవేళ బిచ్చమెత్తుకు. నాలుగు బియ్యపుగింజలు సంపాదించుకు గంజికాచు

కుంటే యంతకంటె గొప్పగా కాలం వెళ్ళిపోతుంది యని అను కునే కాందిశీకులు వేలకువేలున్నారు. మీరెప్పుడైనా చూచారో లేదో ?

ఒకానొక రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని ఒకానొక శిరీష వృక్షం ఎత్తుగాపెరిగి నీడగావొదిగి పూవులతో, కుచ్చులపల్లకీల్లా కొమ్మలల్లాడుతూ ఉంటే, ఎంతో ఇంపుగొల్పేదికద్దు. ఆ చెట్టు క్రింద అప్పటికెంతమంది బాటసారులు పక్కలు పఱచుకునో, ఎండుపూలమీద పఱచుకోకనో, విశ్రమించి, మఱి తిరిగి ప్రయాణమైనారో, జనాభాలెక్క తీసికొన్న నాధుడులేడు.

ఆ పొద్దు, ఒక యువతి, పైచెట్టునున్న పువ్వుకంటె మెత్తని శరీరంగలది, శరీరంకంటె మెత్తందనంగల చిత్తం గలది, ఒక యువతి, ఆ చెట్టుక్రింద మేనువాల్చింది. పచ్చని దబ్బపండులాంటి శరీరచ్ఛాయ, ఎఱ్ఱని మేలిముసుగులోంచి కాపడుతూ, ఉషస్సు ఎన్ని ఊహలు మనలో గొల్పుతుందో, అన్ని ఊహలు గొల్పుతూయుంది. పాలమీగడలో పంచదార మెదపిన సుతారపు ఆహారంమీదనే నిరంతరం పరిఢవిల్లిన ప్రస్ఫుటస్వరూపంగా పరకాయింపున కానింది అంటే నమ్మండి ఆమె !

ఆమె తలవెంపు ఒక సంచీ ఉంది. కాని సంచీమీద మాత్రం ఆమె తలలేదు. ఆమెకు తలాడగా ఆమె బాహువును ఉపకరించుకుంటూయుంది. సంచీలోని సరుకు ఎవరికీ తెలియదు. కాని ముష్టైకట్టిందికాదు. ఆమెకు మగడున్నాడో, మగడెక్కడి కైనా ఊళ్లోకివెళ్ళాడో అని అడుగుదామన్నా, ఆమెను చూచిన వారికి అడుగ బుద్ధిపుట్టదు. ఏమాఅంటే ఆమె అందం చూచుటలో

అందరూకూడా అంతచేటు ముగ్ధులు కావలసిందే! ఆమెకు వచ్చిన భాషకూడా అక్కడ ఉన్నవారెవ్వరికీ రానేరదు. అక్కడ ఉన్నవారి భాష ఆమెకు రానేరదు. మఱి అన్యోన్యం మాట్లాడ మెట్లా ?

అయితే ఆమె వొంటిగా ఊరికేలేదు. ఏదో వింటూవుంది! కడనే ఒక చీమల ఎలుగు, ఎఱ్ఱచీమలపాట !

"కాందిశీకులకు కనకధనం,
మందభాగ్యులకు మంచీ ముత్యం,
మమ్మన్నెవరూ అడుగకున్నలే !
అడిగినవారికి మఱీ అదృష్టం !"

వినబడింది ఆమెకు ఆపాట. తేరిచూచింది ! చీమలబారు ఒకటి నడిచిపోతూవుంది. అవికూడా కాందిశీకులకు మల్లేనే ఆమెకు కనబడ్డాయి. వాటి సాయం, తనకేలాగూ అని, శంకించింది. అయినా పారచూచింది-ప్రతీ మగచీమ ముక్కునా ఒక కందిబద్ద, ప్రతీ ఆడచీమ ముక్కునా ఒక బియ్యపుగింజ, అదే చెక్కుమాత్రంగా, అదే నూకవాటుగా, అవి మోయగలప్రమాణంలో, ఆమెకు గోచరించాయి.

వెంటనే ఆమెకు నాడు, తనకు "ఊరంతా తిరిగినా, ఒక్క బియ్యపుగింజగాని, ఒక్క పప్పుబద్దగాని, ఒక్క కూర తొడిమగాని, ఒక్క ఊరుగాయ పేడుగాని, ఎన్నిగుమ్మాలెక్కి, ఎన్నిగుమ్మాలుదిగి, "అమ్మా" "అయ్యా!" అని యఱచినా పుట్టలేదు. పెట్టలేదు యన్న ఆరాటం ఎత్తింది. కడుపు యేడ్చి నట్టయి వళులు చెమ్మగిల్లాయి !

"మనుష్యులకు లేనిహృదయం చీమలకు ఉంటుందా ?" యని అనుకుంది, అయినా చూదాం అని.

"చీమల్లారా ! చీమల్లారా !
నాతోవున్న భామల్లారా !
మీమీ బిచ్చం పెడతారట్రా !
మీరే పట్నం వెడతారట్రా !"

అని ముఖావంగా యాచించింది.

వెంటనే ఆ చీమలబారు, అల్లావెళ్ళేది, ఇల్లా మళ్ళి ఆమె తలవెంపు సంచీలోకి తమతమ సరుకుతో ప్రవేశింపసాగాయి. కొంతసేపటికి ఉత్తచీమలు వెలికివచ్చాయి.

యువతి సంచీలో చేయిపెట్టిచూచింది, "గుప్పెడు నూకలైనా కావా ? గిద్దెడు చెక్కైనా కాదా ? అన్ని చీమలు లోపలకు వెళ్ళి యివలకు వచ్చాయి, తమతమ ముట్టెకుగల పొల్లో, పొట్టో, సంచీలో పడేసి," యని అనుకొంటూ—

ఆమె చేతిలోకి గుప్పెడు బంగారు పిల్లకాసులు, గుప్పెడు మంచిముత్యాలు వచ్చాయి ! అవి సంచీలో చీమలుపడేసినవేనా లేక తన దేశంనుంచి వచ్చినప్పుడు యందులో తానేవుంచి మఱచిపోయినవా ? అనే సందేహంలోపడి చీమలవంక చూస్తూ సంచీ ఘట్టిగాదులిపింది. వట్టిదయ్యేలా వెలిపింది తన గుప్పిళ్ళల్లోని పిల్లకాసులు మంచి ముత్యాలు నేలపడేలా ! నేలమీదపడుతూంటే, ఒక్కొక్క పిల్లకాసుక్రింద ఒక్కొక్క చీమ, ఒక్కొక్క మంచిముత్యంక్రింద ఒక్కొక్క చీమ, వాటిమీద పడ్డపాటుగా, బరువు తట్టుకోలేక ప్రాణంపోయినట్టుణగారి పోయాయి.

చటక్కున, ఆ కాసులు, ఆ ముత్యాలు యేరిందై యువతి ఆ చీమలు చచ్చిపోయినాయో, జీవంతో ఉన్నాయో అని పరీక్షించింది. అప్పటికప్పుడే వాటితోటి చీమలు, వెనకశ్రేణిలో యుండి, ఇంకా సరుకు సప్పరా మోసుకొస్తూయున్నవి, ఈజీవకళ

తప్పినట్టున్న చీమలవంక ఆగి ఒక్కొక్క మగచీమనోట్లో, ఒక్కొక్క బియ్యపునూక పలుకు, ఒక్కొక్క ఆడచీమనోట్లో ఒక్కొక్క కందిబద్దపిసరు, తాము తెచ్చుకుంటూయున్నవి వాని నోళ్ళకు అందిచ్చాయి ; వెంటనే సంజీవి పోసినట్టు, అమృతం కుడిపినట్టు, పాకతొడగాయి ఆ పడివున్న చీమలు.

యువతి, " వాటికి జీవనాధారమైన సరుకు నా సంచీలో పడేసి, అమరత్యాగం చూపినాయే ఈ చీమలు " అని మెచ్చు కొన్నదై, మెచ్చుకోలు సశేషంలోనే, తాను నిజంగా ఆకలిగొని వుంది కాబట్టి, అడగడం మఱచో, అడిగేదేమిటి యనో, తనకు గల పశుబలంకొద్దీ, కొత్తచీమలలోని ఒకదాని నోట్లోనుండి ఒక మెఱియ, ఒకదాని నోట్లోనుంచి ఒక కందిబద్ద తునియ ఊడలాక్కుని అలా తన నోట్లో వేసికొంది !

" ధునియామేఁ "—" ఎంత కనకమయితే ఆకలితీరను. ఎంతెత్తు ముత్యాల కుప్పవోస్తే దప్పికొఱను ?" అని ఆమె యనుకుంటూ గ్రుక్కుతెంచింది. ఎక్కడి ఆకలి యక్కడే ఆమెకు మాయమైంది, ఎక్కడిదాహం యక్కడే ఆమెకు తగ్గి పోయింది. ఆమెకు మఱి, నాడు తాను మనుష్యులను ఎక్కే గుమ్మందిగే గుమ్మంగా యాచించినప్పటి నిష్ఠురవైఫల్యము, స్ఫురణమాత్రంగానైనా తట్టలేదు.

కాని ఏ చీమనుండి తాను బియ్యపు పిసరు కొల్లగొన్నదో యేచీమనుండి తాను పప్పు చీఱు చూరగొన్నదో, ఆ రెండు చీమలు ఈ పర్యాయం నిజంగా ప్రాణాలు వదిలేశాయి ! చుట్టూ ఎన్ని తోడిచీమలు మూగి ఎంత ప్రయత్నించినా బ్రదుకలేదు ఆ రెండు చీమలూను !

అయితే యువతి వాటివంక చూచిందీలేదు ! యువతిలో అందం లోకం మఱి గమనించిందీ లేదు ! ఊడలాగికోకుండా ఆ రెండుచీమలను వేడివుంటే ఎంత మంచి జరివుండేదో ! ఆమెకూ ఆ చీమలకూ కూడా !

....

బంగ్లయ్యకు గుడ్ - లక్ !

లార్డు లివియథాన్ ఇంగ్లీమాన్. లివియాథాన్ ప్రభ్వీకూడా ఆదేశానకు చెందిన మనిషే. వాళ్ళ పిల్లలందఱూ కూడా ఆ దేశంలో జన్మించినవారే "కన్సెప్షెన్" ఏ దేశంలో కానీయండి.

లివియథాన్ కుటుంబంవారి చాయ ఉడుకుసున్నంలో పైకెత్తిన దూదిపింజెల చాయ నొప్పుతూ, లోపలి వెచ్చని నెత్తురుయొక్క కావి అవి బూరిబుగ్గల్ని బుసకొట్టేలా, బొద్దు దేటి అద్దుకాగితాల్లాంటి దళాసరి చర్మంతో వెలిసివుంటుంది. ఇండియాదేశపు వేడిమి తట్టుకోలేక ముహుర్ముహుర్ఘర్మవారి నేరులు కట్టుకుంటూ "సీలింగు ఫానుల" క్రింద కూర్చుండి "ది ఫ్రెజిడీర్ కూలింగు ప్రిసెర్వ్‌డ్ ఫుడ్సు" ఫలాహారంగా అహరిస్తూ, వారున్నారు ఈ కథాకాలంనాటికి.

లివియథాన్ ప్రభువువద్ద వుండే బట్లేరుపేరు బంగ్లయ్య. బంగ్లయ్య, పక్కా నేటివ్, అవుగాక ! చిన్నప్పుడే మతముచ్చుకు, మూచూచి మూచూచి ముట్టుకొన్నట్టుగా, "వూ"చేసి "వూ"చేసి కట్టుకున్నాడు అనుతాపి అనే ఒక బిబ్లికల్ మహాపాపిని.